సమగ్రంగా ఓటర్ల సర్వే

- ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ
- నియోజకవర్గంలో 2,05,655 మంది ఓటర్లు
- సర్వేలో జిల్లాలోనే మొదటి స్థానంలో నిడదవోలు

నిడదవోలు రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు కచ్చితమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందు కోసం పొరపాట్లకు తావు లేకుండా ఓటర్ల సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ప్రతి ఇంటిని బూత్ లెవల్ అధికారులు సందర్శించి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేస్తున్నారు. నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో 205 పోలింగ్ బూత్‌ల పరిధిలో 2,05,655 మంది ఓటర్లు ఉన్నారు. 2024 జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ప్రతి ఇంటికి వచ్చే బూత్ లెవిల్ అధికారి (బీఎల్‌వో) ద్వారా యాప్‌లో కుటుంబ సభ్యుల ఓట్లు నమోదు అయ్యాయో లేదో ప్రస్తుతం సరి చూసుకోవచ్చు.

ఈనెల 21 వరకు సర్వే ప్రక్రియ

జూలై 21 నుంచి మొదలైన ఇంటింటి సర్వే ఈ నెల 21 వరకూ జరుగుతుంది. నిడదవోలు నియోజకవర్గంలో 71,420 ఇళ్లు ఉండగా 46,760 ఇళ్లల్లో 1,16,853 ఓటర్లను ఇప్పటి వరకు అధికారులు సర్వే చేశారు. ఓటర్ల సర్వే ప్రక్రియలో జిల్లాలోనే నిడదవోలు నియోజకవర్గం తొలి స్థానంలో ఉంది. ఓటరుగా నమోదు కావాలనుకునేవారు బీఎల్వోల యాప్ ద్వారా చేసుకోవచ్చు. కుటుంబ సభ్యులు మరణించినా, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లినా కుటుంబ సభ్యుల అనుమతితో వాటిని తొలగిస్తున్నారు. ఇంటి నంబర్, పేరు, వయసు ఓటర్ల జాబితాలో తప్పుగా నమోదైనా ఫారం–8 ద్వారా సరి చేస్తున్నారు. ఫారం–6 ద్వారా సాధారణ ఓటర్లను చేరుస్తున్నారు. ఫారం 6–ఏ ద్వారా ప్రవాస భారతీయుల(ఎన్ఆర్ఐ)ను కూడా ఓటరుగా నమోదు చేస్తున్నారు. ఫారం–7 ద్వారా ఓటర్లను తొలగిస్తున్నారు. ఓటరు తాము నివసిస్తున్న పోలింగ్ స్టేషన్ పరిధిలో కాకుండా, వేరే పీఎస్ పరిధిలో ఉంటే వారిని తమ ప్రాంతంలో ఉండే పోలింగ్ స్టేషన్ పరిధిలోకి తీసుకు వస్తున్నారు. ఓటరు మార్పునకు ఫారం–8ను వినియోగిస్తున్నారు. ఓటర్ల జాబితాలో పీడబ్ల్యూడీ ఓటర్లను మార్కు చేస్తున్నారు. ఈ ఏడాది అక్టోబరు 17న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను, వచ్చే ఏడాది జనవరి 5న తుది జాబితాను ప్రకటిస్తారు.

నిశితంగా పరిశీలిస్తున్న బీఎల్వోలు

సమగ్ర సర్వేను బూత్ లెవల్ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. పరిశీలనలో ఒకే వీధి పేరు, ఒకే ఇంట్లో ఒకే డోర్ నంబర్లో ఎక్కువ ఓట్లు నమోదై ఉంటే, నిశితంగా పరిశీలన చేస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లలో వివిధ అంతస్తుల్లో ఉంటున్న వారికి నంబర్లు ఇస్తున్నారు. జీరో నంబరు ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇప్పటికే ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి వారి ఫిర్యాదులు, సలహాలు స్వీకరించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ బూత్‌లను గుర్తించి, ఓటింగ్ శాతాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఓటు ఆవశ్యకతను ప్రజలకు వివరించి చైతన్య పరుస్తున్నారు. విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్నారు.


శెట్టిపేటలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వే చేస్తున్న బీఎల్‌వోలు


సమగ్ర ఓటర్ల ప్రక్రియపై బీఎల్‌వోలతో నిడదవోలులో సమీక్ష జరుపుతున్న తహసీల్దార్ (ఫైల్)

నియోజకవర్గంలో ఓటర్ల సర్వే ప్రక్రియ వివరాలు

మండలం	గృహాల సంఖ్య	సర్వేపూర్తి చేసిన గృహాలు	మొత్తం ఓటర్లు	సర్వేపూర్తిచేసిన ఓటర్ల సంఖ్య
నిడదవోలు	31,631	22,456	89,609	57,567
ఉండ్రాజవరం	20,597	18,174	59,826	45,517
పెరవలి	19,192	6,130	56,220	13,769
మొత్తం	71,420	46,760	2,05,655	1,16,853

తప్పనిసరిగా చెక్ చేసుకోవాలి



బీఎల్‌వోలు వచ్చినపుడు ఓటరు తప్పనిసరిగా మీ సమాచారాన్ని ఇచ్చి, మీ ఓటు ఉందో లేదో ధ్రువీకరించుకోవాలి. లేకపోతే నమోదు చేయించుకోవాలి. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఉన్నా బీఎల్‌వోల దృష్టికి తీసుకు వచ్చి సరిచేసుకోవాలి. ఒకే వీధి, ఒకే అపార్ట్‌మెంట్ పేరు మీద ఎక్కువ ఓట్లు నమోదై ఉంటే వాటిని పరిశీలించి, డోర్ నంబర్లు కేటాయిస్తున్నాం. ఇంటింటి సర్వే చేసి, పారదర్శకంగా ఓటర్ల జాబితాలను తయారు చేస్తున్నాం. ఓటింగ్ శాతం పెరగడానికి అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం.గంగరాజు, తహసీల్దార్, నిడదవోలు

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్‌కృష్ణ

చాగల్లు: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు (పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయలు) ఎస్.రాజీవ్‌కృష్ణ అన్నారు. మండలంలోని కలవలపల్లిలో సొసైటీ అధ్యక్షుడు గూడపాటి శివ నివాసంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. పార్టీ శ్రేణులు చిత్తశుద్ధి, సమన్వయంతో పనిచేసి రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. గూడపాటి శివ తండ్రి కృష్ణారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను రాజీవ్ కృష్ణ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణారావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, కొవ్వూరు, చాగల్లు ఎంపీపీలు కాకర్ల నారాయుడు, మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు పిల్లి తిరుమలరావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

'సంగినీడి'కి పలువురి పరామర్శ

నిడదవోలు రూరల్: మండలంలోని డి.ముప్పవరం ఎంపీటీసీ సభ్యుడు సంగినీడి సత్యనారాయణ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, పార్టీ నాయకులు నాగిరెడ్డి సత్తిపండు, పసుపులేటి చిట్టియ్య, మద్దాల ప్రభు, అజయ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నేడు ప్రతి ఇంటిపై జాతీయ పతాకం

నల్లజర్ల: ఆజాద్ కీ అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని ఉపాధి హామీ ఏపీఎం సత్యనారాయణ తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమం కూడా చేపట్టినట్టు చెప్పారు. ఇందుకు కోసం 1300 కొబ్బరి,మరో 500 సపోటా, మామిడి మొక్కలు వారికి అందజేసినట్టు చెప్పారు. అన్ని పంచాయతీలలో నాభూమి–నాదేశం, నేల తల్లికి నమస్కారం –వీరులకు వందనం కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు.

కొవ్వూరు: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పరవస్తు సత్య గోపీనాథ్ దాస్ సేవా ట్రస్టు ద్వారా ఆదివారం పట్టణంలో జాతీయ జెండాలను పంపిణీ చేశామని బీజేపీ జిల్లా కార్యదర్శి పిక్కి నాగేంద్ర తెలిపారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించాలన్న ఉద్దేశంతో దేశ సర్వభౌమత్వానికి, ఐక్యతకు ప్రతీక అయిన జాతీయ పతాకం ప్రతి ఇంటిపై ఎగరాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్క ఇంటిపైన త్రివర్ణ జెండాను ఎగుర వేయాలని కోరారు.

సుందరేశ్వరునికి విశేష పూజలు


సుందరేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని బాలా త్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. అధిక శ్రావణ మాసం సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు అనుపిండి చక్రధరరావు, జయలక్ష్మి ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష పత్రి పూజ నిర్వహించారు.స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, శ్రీసూక్త విధానంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని విశేష అలంకరణ చేశారు.అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి దర్శించుకున్నారు.ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసమూర్తి,మానేపల్లి సుందర గణేష్ పూజా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'కవులూరి'కి సాహితీ చదరంగ ప్రపూర్ణ పురస్కారం


హైదరాబాదులో అవార్డు అందుకుంటున్న కవులూరి ప్రసాదరావు

గోపాలపురం: మండలంలోని వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన కవులూరి ప్రసాదరావుకు సాహితీ చదరంగ ప్రపూర్ణ బిరుదు లభించింది. కాకతీయ వైభవ కీర్తి అనే సంస్థ హైదరాబాద్‌లో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేసింది. కొవ్వూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న ప్రసాదరావుకు బాల్యం నుంచి సాహిత్యాభిమాని. అంతేగాకుండా మానవ మనస్తత్వ విశ్లేషణలో ఆయనకు అనుభవం ఉంది.

గాయపడిన విద్యార్థినులకు ఆర్థిక సాయం

గోపాలపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రత్తిపాటి నిహారిక, అచ్యుతాదేవి అనే అక్కాచెల్లెళ్లకు మానవత సంస్థ మండల శాఖ ఆదివారం ఆర్థిక సహాయం చేసింది. మండలంలోని పెద్ద గూడేనికి చెందిన వారిద్దరూ ఇటీవల అదే గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వారిద్దరి కాళ్లకు ఆపరేషన్ చేయడంతో ఏడాది పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించడంతో ఇంటి వద్ద నుంచే చదువుకుంటున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న మానవత సంస్థ సభ్యులు మందుల ఖర్చుల నిమిత్తం రూ.4 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు మరో రూ. 2 వేల ఆర్థిక సహాయాన్ని విద్యార్థినులకు అందజేశారు. మానవత సంస్థ మండల శాఖ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, మండల శాఖ అధ్యక్షుడు ముప్పన కృపావరప్రసాద్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో..

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో తాళ్లపూడి బీసీ కాలనీకి చెందిన గురుగుబెల్లి సూర్యనారాయణకు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన గాయపడ్డాడు. అతడి వైద్య ఖర్చుల నిమిత్తం మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు సాయన సుబ్బారావు చేతుల మీదుగా రూ. 5 వేలు సాయం చేశారు. అలాగే ఆ సంస్థ సభ్యులు చంద్రయ్య రూ.500, యల్లాపు కృష్ణ రూ.500 అందజేశారు.

నేటితో ముగుస్తున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు

కొవ్వూరు: పంచాయతీ వార్డు మెంబర్ల నామినేషన్ ఉపసంహరణకు సోమవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఉంది. కొవ్వూరు డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో తొమ్మిది పంచాయతీ వార్డు మెంబర్ ఉప ఎన్నికలకు 29 నామినేషన్‌లు దాఖలైన విషయం తెలిసిందే. పరిశీలన అనంతరం అవన్నీ సవ్యంగానే ఉన్నాయని డివిజనల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ తెలిపారు.

త్యాగధనుల జ్ఞాపకం..ఈ స్మారక స్తూపం

- నల్లజర్లలో 12 మంది స్వాతంత్య్ర యోధులు
- రేపు భారత 75వ స్వేచ్ఛా దినోత్సవం సందర్భంగా..

నల్లజర్ల: స్వాతంత్య్రోద్యమ పోరాటంలో నల్లజర్లకు ఓ విశిష్ట స్థానం ఉంది. ఉద్యమానికి 12 మందిని అందించిన ఘనత ఈ ప్రాంతానిది. వల్లూరి సుబ్బన్న ఆధ్వర్యంలో అన్ని వర్గాల వారు స్వాతంత్య్ర పోరాటంలో కీలక పాత్ర పోషించారు. జైలుశిక్ష అనుభవించారు. నాటి పోరాట యోధుల జ్ఞాపకార్థం స్వాతంత్య్రం సిద్ధించి 25 ఏళ్ళయిన సందర్భంగా జాతి తరఫున 1972 ఆగస్టు15 నుంచి 1973 ఆగస్టు 14 వరకూ భారత సంవిధానం పేరిట పూర్వపు సమితి కార్యాలయ ఆవరణలో భారత ప్రభుత్వం ఓ స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేసింది. మహాత్ముని పిలుపు మేరకు ఈ ప్రాంతానికి చెందిన తల్లాప్రగడ ప్రకాశరాయుడు, వల్లూరి సుబ్బన్న, తల్లా ప్రగడ రాజభూషణం, తల్లాప్రగడ దుర్గాప్రసాదరావు, వేగేశ్న సుబ్బరాజు, తిరుమలరాజు వెంకట సుబ్బరాజు, కనుమూరి వెంకటరాజు, పసల కృష్ణమూర్తి, పసల అంజలక్ష్మి, టీఎస్ఎన్ శర్మ, గీతా గంగమ్మ, ఆలపాటి వెంకటసుబ్బయ్య సత్యాగ్రహ, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారు. జైళ్లకు వెళ్లారు. విలువైన తమ ఆస్తులను పోగొట్టుకున్నారు. నాటి సమరయోధుల పేర్లతో పాటు అశోక చక్రం, జాతీయ చిహ్నాలైన తామర పువ్వు, నెమలి, సింహం బొమ్మలతో పాటు రజతోత్సవ విశేషాలను హిందీ, తెలుగు భాషల్లో ఈ స్తూపంపై లిఖించారు. ఇది నాటి చరిత్రకు సజీవ సాక్ష్యంగా, నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తోంది.


నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమరయోధుల స్మారక స్తూపం

ఇంతటి చరిత్ర ఉన్న ఈ ప్రాంతాన్ని 2015 డిసెంబర్ 9న మహాత్ముని మనువరాలు ఉషా గోగాని గాంధీ సందర్శించారు. వట్టి గొప్పలు చెప్పకుండా దేశానికి ఏదైనా మేలు చేసి చూపాలన్న మహాకవి గురజాడ స్ఫూర్తిని పాటిస్తూ ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవం రోజు పతాకావిష్కరణ చేసేవారంతా మననం చేసుకోవాలని గాంధేయవాదులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇక కళాశాల అభివృద్ధిపై దృష్టి పెడదాం

తాళ్లపూడి: ఎంతో చరిత్ర కలిగిన వేగేశ్వరపురం జూనియర్ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కూడా కృషి చేయాలని పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మారిన రామ్మూర్తి కోరారు. వేగేశ్వరపురం కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 75వ, జూనియర్ కళాశాల 45వ వార్షికోత్సవాలను ఇటీవల ఘనంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అదే విద్యాసంస్థ ఆవరణలో ఉత్సవాల నిర్వహణ కమిటీ ఆదివారం కృతజ్ఞతా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి సంఘం తరఫున రూ.50 వేలతో కంప్యూటర్, డిజిటల్ కలర్ ప్రింటర్‌ను కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీలో సేవలు అందించిన పూర్వ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ప్రొఫెసర్ కైగాల సుబ్బారావు కృషితో ఉన్నత పాఠశాల అభివృద్ధి చేశామని, అలాగే జూనియర్ కళాశాలను కూడా అభివృద్ధి చేయడానికి ముందుకు రావాలన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థి సంఘ సభ్యులు శీర్ల సత్యనారాయణ, వీరమల్లు సూర్యనారాయణ, జీటీపీ ప్రసాద్, పరస రాధాకృష్ణ, ముక్క శ్రీను, అడ్డాల డేవిడ్‌రాజు, మండవల్లి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు కంప్యూటర్ బిల్లు, వారంటీ పత్రం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

సంఘటితమైతేనే ఆర్యవైశ్యుల అభివృద్ధి సాధ్యం

- మహాసభ గ్లోబల్ చైర్మన్ టీజీ వెంకటేష్
- రాష్ట్ర, జిల్లా కార్యవర్గాల ప్రమాణ స్వీకారం

కొవ్వూరు: ఆర్యవైశ్యులంతా సంఘటితంగా మెలిగితే అభివృద్ధి చెందవచ్చని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ సూచించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర, జిల్లా నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం స్థానిక పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఉద్యోగావకాశాలు రాకపోయినప్పటికీ ఆర్యవైశ్యులు వ్యాపార అవకాశాలను వదులు కోకూడదన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉన్న వ్యక్తులు మాత్రమే ఆర్యవైశ్య సంఘాలకు నాయకత్వం వహించాలని మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ పేర్కొన్నారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర సంఘం అధ్యక్షుడిగా కోనా శ్రీనివాసరావు, జిల్లా సంఘం అధ్యక్షుడిగా కొత్త బాల మురళీకృష్ణలతో టీజీ వెంకటేష్, గ్లోబల్ చైర్మన్ టంగుటూరి రామకృష్ణ, అంబికా కృష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నిరుపేద ఆర్యవైశ్యులకు మండలానికి మూడు చొప్పున 80 గ్రైండర్లు పంపిణీ చేశారు. నిరుపేద విద్యార్థులకు రూ.10 వేల చొప్పున ముగ్గురికి స్కాలర్ షిప్‌లు అందజేశారు. ఆర్యవైశ్య మహాసభ అడ్వైజర్ దేవకి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వీవీకే నరసింహమూర్తి, అదనపు కార్యదర్శి నుదురు మాటి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి మద్దుల సత్యనారాయణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గ్రంధి గౌతమ్, జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు నాళం వీర వెంకట శ్రీనివాసరావు, గౌరవ సలహాదారుడు గ్రంధి ప్రవీణ్, కొవ్వూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కొవ్వూరు టోల్ గేట్ జంక్షన్ నుంచి భారీగా సభ ప్రాంగణానికి తరలి వచ్చారు.


కత్తిని ప్రదర్శిస్తున్న కోనా శ్రీనివాసరావు, టంగుటూరి రామకృష్ణ, టీజీ వెంకటేష్‌లు

సంక్షేమ పథకాలు, జవాబుదారీతనంతో..

- జగన్‌మోహన్‌రెడ్డి పాలన
- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు 1వ వార్డులో గడప గడపకూ..

కొవ్వూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా ప్రజలకు జవాబుదారీతనంతో పని చేయాలనే ఉద్దేశంతోనే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలో ఒకటో వార్డు పరిధిలోని శ్రీరామ కాలనీలో 120 రోజు ఆదివారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలసి మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఒకటో వార్డు నాయకులు పిక్కి శ్రీనివాస్, యజ్జల శ్రీనివాస్, నేతల వెంకటేష్, మాసా ఆనంద్, వేము వెంకటరత్నం, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ పట్టణశాఖ అధ్యక్ష ,గౌరవాధ్యక్షులు రుత్తల భాస్కరరావు, నగళ్లపాటి శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, నాయకులు వరిగేటి సుధాకర్, చిట్టూరి అన్నవరం, పోసిన శ్రీకృష్ణదేవరాయులు, గంగాధర నాగేశ్వరరావు, కవల నాగేశ్వరరావు, వర్రే నాగ మురళి కో–ఆప్షన్ సభ్యులు ఏలూరి వెంకట్, ఎండీ ఆలీ పాల్గొన్నారు.


కొవ్వూరు ఒకటో వార్డులో వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి తానేటి వనిత

కరాటేలో బెల్టు టెస్టులకు 17 మంది ఎంపిక

కొవ్వూరు: అచీవర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం కరాటే బెల్ట్ టెస్టులు నిర్వహించారు. నలభై మంది కరాటే క్రీడాకారులు ఈ టెస్టులకు హాజరయ్యారు. ఎల్లో బెల్ట్‌కు మహిర, విజయ్, ఇంద్రకాంత్, ముకుందు, ఆరంజ్ బెల్ట్‌కి సీహెచ్ మహీధర్, బ్లూ బెల్ట్‌కి జి.నేహంత్, టి.గీతిక, సీహెచ్ గీతిక, కె.హర్షిత, కె.చాందిక్, గ్రీన్ బెల్ట్‌కు జి.నోషిత, సీహెచ్ యోజిత్‌నంద, వి.సిద్దార్థ, జి.శ్రీహర్షిత, పర్పుల్ బెల్ట్‌కి బి.ధార్మిక్, ఎం.వంశీకృష్ణ ఎంపికైనట్టు కరాటే ఇన్‌స్ట్రక్టర్ ఆళ్ల రాధ తెలిపారు. ముఖ్య అతిథులుగా ఉద్యాన శాఖాధికారి సీహెచ్ శ్రీనివాసరావు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఈఈ ఎస్‌కే ఖాజావలీ హాజరయ్యారు. ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డీఎల్ నారాయణ ఆధ్వర్యంలో ఈ టెస్టులు నిర్వహించారు.


కరాటే బెల్టు టెస్టులకు హాజరైన విద్యార్థులు

వేగంగా ప్రధాన రోడ్డు విస్తరణ పనులు


నిడదవోలు సెంట్రల్ డివైడర్ పనులు

నిడదవోలు: పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆదేశాల మేరకు ఆదివారం కూడా పనులు నిర్వహించారు. స్థానిక పాటిమీద సెంటర్ నుంచి గణపతి సెంటర్ వరకు 15వ ఆర్థిక సంఘం, మున్సిపల్ సాధారణ నిధులు రూ.మూడు కోట్ల వ్యయంతో ప్రధాన రోడ్డు విస్తరణ, ఆధునీకరణ పనులు చేపట్టారు. ఇప్పటికే నాలుగు లైన్ల సీసీ రోడ్డు పనులు పూర్తి కావచ్చాయి. గణపతి సెంటర్‌లోని పలు ఆక్రమణలను తొలగించి రోడ్డు టర్నింగ్ నుంచి గణపతి థియేటర్ రోడ్డు వరకూ సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఇక్కడున్న పలు దుకాణాల ఆక్రమణల తొలగింపు పనులు పూర్తయితే టర్నింగ్‌లో సీసీ రోడ్డు పనులు చేపడతారు. నాలుగు లైన్ల సీసీ రోడ్డు పనులు పూర్తయిన ప్రాంతాల్లో ప్రస్తుతం సెంట్రల్ డివైడర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నాలుగు లైన్ల రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వాల్స్‌ను ఎత్తు చేసి వాటికి కాంక్రీటు కవర్ శ్లాబ్‌లు నిర్మిస్తారు. రోడ్డుకు ఇరువైపులా సైడ్ బెర్మ్‌లో లాకింగ్ టైల్స్ పనులు చేపట్టి సుందరీకరించనున్నారు. సెంట్రల్ లైటింగ్‌తో పాటు డివైడర్ల మధ్యలో ఆర్నమెంటల్ మొక్కలు నాటుతారు.

అన్నపూర్ణ నగర్ రోడ్లకు త్వరలో మోక్షం

నిడదవోలు: పట్టణంలోని రెండో వార్డు అన్నపూర్ణ నగర్‌లో అధ్వానంగా ఉన్న రోడ్లకు త్వరలోనే మోక్షం కలగనుంది. వర్షాకాలంలో స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కౌన్సిలర్ ఆలమూరి భారతి గ్రావెల్ రోడ్లు నిర్మించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ దృష్టికి తీసుకు వెళ్ళారు. దీంతో వెంటనే స్పందించిన చైర్మన్ ఆదినారాయణ గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చెయ్యాలి అధికారులను ఆదేశించారు. అంతేగాకుండా ఈ పనులకు మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలు కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదించింది. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తికావడంతో త్వరలో పనులు చేపడతామని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు.

సెప్టెంబర్ 9న జాతీయ మెగా లోక్ అదాలత్

కొవ్వూరు: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.సత్యవతి తెలిపారు. పరిష్కరించదగిన అన్ని రకాల పెండింగ్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు.సివిల్, క్రిమినల్, ప్రమాద బీమా, చెక్ బౌన్స్, మనోవర్తి, బీఎస్ఎన్ఎల్, బ్యాంకు రుణాలకు సంబంధించిన కేసులను లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు.లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసులపై అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదన్నారు.అంతేగాకుండా సమయం, ఖర్చులు ఆదా చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.